మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# కమనీయం రాములోరి కళ్యాణం

- కన్నుల పండువగా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం
- పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, పార్లమెంట్ సభ్యులు మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఆలయాభివృద్ధికి రూ.2కోట్లు మంజూరు చేసిన మంత్రి జూపల్లి



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే



అమ్మవారి మెడలో వేసే తాళి చూయిస్తున్న ఆలయ అర్చకులు



కళ్యాణోత్సవంలో జూపల్లి కృష్ణారావు, పార్లమెంట్ సభ్యులు మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు



కళ్యాణోత్సవంలో భక్తులు

**వంగూరు, ఏప్రిల్6, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోనే రెండో అపరభద్రాదిగా పేరొందిన చారకొండ మండలం శిర్స న గండ్ల గుట్టపై అశేష జనవాహిని మధ్య రాములోరి కళ్యాణ మహోత్స వ వేడుకలు అత్యంత శోభయమానంగా నిర్వహించారు. వేదపండితులు, ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య మంగళవాయిధ్యాలతో అంగరంగా వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం కన్నుల పండువగా జరిపించారు. కళ్యాణ మహోత్సవానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లురవిలు పట్టువస్త్రాలు, తలంబ్రాలు అధికారలాంఛనాలతో సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు, పార్లమెంట్ సభ్యులు మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు, అచ్చంపేట, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్, ఆర్డీఓ శ్రీనునాయక్, తహసీల్దార్ సునిత, డీఎస్పీ వెంకటేశ్వర్లులు హాజరై కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. సీతారాముల మూల విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి జిలకర, బెల్లం పెట్టి ముత్యాల తలంబ్రాలు భక్తులు తిలకిస్తుండగా పోసి శ్రీ విశ్వవాసు సంవత్సర ఉత్తరాయ వసంత రుతువు చైత్ర మాస శుక్లపక్ష నవమి పుష్య నక్షత్రం ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు శిర్సనగండ్ల గుట్టపై శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవాన్ని అధికార లాంఛనాలతో అంగరంగా వైభవంగా జరిపించారు. కళ్యాణోత్సవానికి విచ్చేసిన అతిథులకు ఆలయ అర్చకులు, చైర్మన్ రామశర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

**ఆలయాభివృద్ధికి రూ. 2కోట్లు మంజూరు చేసిన మంత్రి జూపల్లి**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ శ్రీ రామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. శిర్సనగండ్ల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాభివృద్ధి కోసం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంత్రి జూపల్లికృష్ణారావును రూ. 5కోట్లు మంజూరు చేయాలని కోరగా తక్షణమే రూ. 2కోట్లు మంజూరు చేస్తున్నానని భక్తుల ముందు హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి రూ. 50కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తానని మంత్రి వివరించారు. రామాయణం మనకు ఎన్నో జీవితపాఠాలను నేర్పిస్తుందని, ముఖ్యంగా కుటుంబ బాంధవ్యాల గురించి వర్ణిస్తుందన్నారు. మంచికి, చెడుకు మధ్య తారతమ్యాన్ని.. చెడు చేసిన వాళ్లను క్షమించగలిగే గుణాన్ని మనకు నేర్పిస్తుందిని పేర్కొన్నారు. ప్రస్తుతం సమాజంలో ఎన్నో ఆఘాయిత్యాలను చూస్తున్నామని, ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడానికి ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, భార్యాభర్తల మధ్య సంబంధాలు సరిగ్గా లేక పోవడం, ఇంట్లో మంచి మాటలు చెప్పే పెద్దలు లేకపోవడం, భార్యాభర్తల మధ్య అర్థం చేసుకునే స్వభావం లేకపోవడం ప్రధాన కారణాలని వివరించారు. సీతారాముల బాంధవ్యం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందిని చెప్పుకొచ్చారు. తండ్రి మాట జవదాటని శ్రీరాముడు, అంతే కాకుండా తమ జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా ఒకరిని ఒకరు విడవలేని సీతారామచంద్రులు అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు.

**శ్రీ సీతారాముల కళ్యాణోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు**

శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు శిర్సనగండ్ల గుట్టకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కళ్యాణమండపం చలువపందిళ్లు, ప్రత్యేక ఎల్ఈడీలను ఏర్పాటుచేశారు. భక్తులకు దాహార్తిని తీర్చేందుకు తాగునీటి సౌకర్యం కల్పించారు. వైద్య సిబ్బంది క్యాంప్‌ను ఏర్పాటు చేసి మందులను ఏర్పాటు చేశారు. దాతలు, ఆలయసిబ్బంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులను ఎండ తాకిడి నుంచి కాపాడేందుకు మజ్జిగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు కలుగకుండా గుట్ట వద్దకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకట్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ నర్సింహ్మారెడ్డి, చాంకొండ మాజీ సర్పంచ్ విజేయందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలను అప్రమత్తం చేసిన పోలీసులు...**

శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహిస్తుండగా భక్తులు కళ్యాణోత్సవం తిలకిస్తుండగా చేతివాటం ప్రదర్శించే వారుంటారని గుర్తిస్తూ కళ్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులను అప్రమత్తం చేశారు. దొంగలు ఉన్నారు జాగ్రత్త అంటూ ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తూ భక్తుల అభరణాలను కొల్లగొట్టకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు కళ్యాణ ప్రాంగణమంతా సీసీ కెమెరాలతో అమర్చి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు చేపట్టారు.

# మన్యంకొండ స్వామి ఆశీస్సులుండాలి

- ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- మన్యకొండలో ప్రత్యేక పూజలు
- మహబూబ్‌నగర్, హన్వాడలో రాములోరి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే



మన్యకొండ ఆలయంలో ఎమ్మెల్యే యెన్నం ప్రత్యేక పూజలు

**మహబూబ్‌నగర్‌బ్యూరో, ఏప్రిల్6, ప్రభాతవార్త:** మన్యం కొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని పేదల తిరుపతి మన్యంకొండ దేవస్థానంలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేకు వేద పండితులు వేద ఆశీర్వాదం అందించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు దేవాలయంలో నిర్వహిస్తున్న అఖండ భజనలో ఆయన పాల్గొన్నారు. వర్షాలు కురిసి రైతులకు మంచి దిగుబడి రావాలని, భగవంతుని కోరినట్లు చెప్పారు.

- శ్రీ రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్‌నగర్, శ్రీ రామాలయంలో జరిగిన రాముల వారి కళ్యాణానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- హన్వాడ మండలం లోని పెద్ద దర్పల్లి మరియు పిల్లిగుండు తాండాలో శ్రీ రామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవానికి ఎమ్మెల్యే యెన్నం ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు పెద్ద దర్పల్లి గ్రామంలో స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

- అప్పన్నపల్లిలో శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవానికి ఆయన హాజరై కళ్యాణాన్ని వీక్షించారు. పూజల్లో నాయకులు హరిబాబు, రామాంజనేయులు, శివ, రామ కృష్ణ, ఎం ఆర్కె రెడ్డి పాల్గొన్నారు.

- మహబూబ్‌నగర్ పట్టణంలోని ఏనుగొండ ఆంజనేయస్వామిదేవాలయం, శ్రీనివాసకాలనీలోని పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయం, ధనలక్ష్మి కాలనీ లోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో జరిగిన శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగాహాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయన వెంట ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు సుధాకర్ రెడ్డి, కుర్మయ్య, శ్రీనివాస్ రెడ్డి, మనికొండ నరేంధర్ రెడ్డి, మల్లు అనిల్ రెడ్డి, ధర్మాపుర్‌నర్సింహారెడ్డి, అనిల్ రెడ్డి, మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే పర్సనల్ కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.



అప్పనపల్లి పూజలో ..



హన్వాడ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులతో

# కమలం వికసించాలి.. కాషాయ జెండా ఎగరేయ్యాలి

- వారం రోజుల పాటు పార్టీ ఆవిర్భా వేడుకలు
- చలో గావ్, చలో బస్తీ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు
- మహబూబ్‌నగర్ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపి డీకే అరుణ
- మహబూబ్ నగర్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ



జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీ డీకే అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 6, ప్రభాత వార్త:** పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని, ప్రజల్లోకి పార్టీ పథకాలను తీసుకెళ్లాలని వారం రోజులపాటు అవగాహన కల్పించాలని మహబూబ్‌నగర్ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపి డీకే అరుణ అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డితో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు. ఎంపీ డీకే అరుణ పార్టీ వ్యవస్థాపకుల చిత్ర పాటాలకు ఘన నివాళులు అర్పించారు. జై బీజేపీ నినాదాలతో పార్టీ కార్యాలయ పరిసర ప్రాంతాలు హోరేత్తాయి. పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా ఆఫీస్‌లో అరుణ కీలక సమావేశం నిర్వహించారు. పార్టీ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా చేపట్టబోయే కార్యక్రమాలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈనెల 25 వరకు చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. పార్టీ కేంద్రకమిటీ పిలుపు మేరకు నాయకులు, కార్యకర్తలు అన్ని కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. శ్రీరాముడు ఆశీర్వదించాలి..మోడీ నిలవాలి, దేశం సుభిక్షంగా ఉండాలన్నారు. పార్టీ క్షేత్రస్థాయిలో బలపడాలని సూచించారు. తెలంగాణలో అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. ఆవిర్భావ ఉత్సవాలు పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా పార్టీ జెండా ఆవిష్కరించుకున్నాం బీజేపీ ఆవిర్భావ వేడుకలు దేశ వ్యాప్తంగా పండుగల చేసుకుంటున్నాం.. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్ని కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వారం రోజులపాటు ఈ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించాలన్నారు. ప్రతి కార్యకర్త ఇంటిపై జెండాలు ఎగురవేయాలన్నారు. దళిత మోర్చా ఆధ్వర్యంలో గావ్ చలో, బస్తీ చలో పేరుతో ఊరూరా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈనెల 13 నుంచి 25వరకు అంబేద్కర్ సంయాన్ అభియాన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. ఊరూరా 13న అంబేద్కర్ విగ్రహాల శుభ్రం చేసే కార్యక్రమం, 14 న సాయంత్రం అంబేద్కర్ విగ్రహాల వద్ద దీపాల వెలిగింపు, నివాళులు , 15 నుంచి 25 వరకు ప్రజల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలందరికీ సీతారాముల ఆశీస్సులుండాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు పద్మజారెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీరెడ్డి, నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

# కొనసాగుతున్న సహాయక చర్యలు

- నిరంతరంగా స్టీలు
- ఇన్‌లెట్ 1 వద్ద ప్రత్యేకాధికారి సమీక్ష



టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్‌జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమలపెంట గ్రామంలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతున్నట్లు టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. ఆదివారం ఎస్ఎల్‌బిసి టన్నెల్ ఇన్లెట్ 1 ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సహాయక బృందాల ఉన్నతాధికారులకు పలు సూచనలు, సలహాలు ఇస్తూ రెట్టింపు సహాయక సిబ్బందితో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా సహాయక బృందాలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబాలతో జరుపుకోవాల్సిన పండుగలను సైతం లెక్కచేయకుండా సహాయక చర్యల్లో పాల్గొంటున్న సహాయక సిబ్బందినీ ప్రత్యేకంగా అభినందించారు. ఎస్ఎల్‌బిసి, సొరంగంలో కొనసాగుతున్న మట్టి తవ్వకాలు ప్రతిరోజూ 20మీటర్ల మేర చేపడుతూ, స్టీలు భాగాలను కత్తిరిస్తూ టన్నెల్ బయటికి తరలిస్తున్నట్లు, నిరంతరాయంగా వస్తున్న ఊటనీటిని అత్యధికసామర్థ్యం గల మోటార్‌పంపుల ద్వారా బయటికి పంపింగ్ చేస్తున్నట్లు, వివరించారు. ప్రమాదప్రదేశంలో నీటి పారుదలశాఖ అధికారులు నిరంతరం పరిశీలిస్తూ సహాయక బృందాలకు అవసరమైన సూచనలు సలహాలు అందజేస్తున్నారని, దక్షిణమధ్య రైల్వే సహాయక సిబ్బంది నిరంతరం స్టీల్ను కత్తిరించే పనులు చేపడుతూ మట్టి తవ్వకాలకు అనుగుణంగా కన్వేయర్ బెల్ట్ ద్వారా మట్టి నీ బయటకు తరలిస్తున్నట్లు తెలియజేశారు. టన్నెల్ లోపల సహాయక చర్యల్లో పాల్గొంటున్న సహాయక సిబ్బందినీ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులను, సహాయక సిబ్బందికికావలసినసౌకర్యాలను, సామాగ్రిని, పౌష్టికాహారాన్ని అందిస్తున్న సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈసమావేశంలో ఆర్మీఅధికారులు, జేపీకంపెనీ సీనియర్‌ప్రాజెక్ట్ ఇంజనీర్ సంజయ్‌కుమార్‌సింగ్, సింగరేణి ఫైన్స్ రిస్క్యూజనరల్ మేనేజర్ బైద్య, ఎస్‌డిఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ బోరింగ్ బాట..

- కావేరమ్మపేటలో పాతరోజులు
- మిషన్ భగీరథ నీళ్లు రాక జనాల ఇబ్బందులు
- పట్టించుకోని కమిషనర్, డీఈ, ఏఈలు
- వార్డు ప్రజల కోసం దీక్ష చేస్తానంటున్న కౌన్సిల్ బుక్క మహేశ్



కావేరమ్మపేటలో బోరింగ్ వద్ద బిందెలతో కాలనీవాసులు

**జడ్చర్ల, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో మళ్లీ పాత రోజులు వచ్చాయి. కావేరమ్మపేటలో తాగునీరు అందక జనాలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగరథ నీళ్ల రాక వారం రోజులు అవుతుందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇక చేసేదేమి లేక బోరింగ్‌లు, బోరు బావుల చుట్టూ తిరుగుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట 2,11,10వ వార్డులతోపాటు హౌసింగ్ బోర్డు 8,9 వార్డులకు మల్లేబోయిన్‌పల్లి మిషన్‌భగీరథ గ్రిడ్ నుంచి తాగునీరు సరఫరా అవుతున్నది. గత ఐదారు నెలలుగా నీరు సరిపడా సప్లయి కావడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా గ్రిడ్ వద్ద విద్యుత్ సమస్య ఉన్నట్లు తెలుస్తున్నది. నీరు సరిపడా

- మిగతా4లో..

**దీక్ష చేస్తా ..**



ఆరు నెలలుగా నీళ్ల సమస్య ఉన్నది. రంజాన్ రోజు వచ్చాయి భగీరథ నీళ్లు. వారం రోజులు అవుతుంది.. కమిషనర్ సారుకు ఉదయం నుంచి ఫోన్ చేస్తే సాయంత్రం గానీ స్పందించరు. జనాలు బోరింగ్‌ల వద్ద నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు. 2వ వార్డు ఈదమ్మ టెంపుల్ వద్ద పురాతన బావి ఉన్నది. అందులో 30హెచ్‌పీ మోటారు బిగించినా నీటి సమస్య కొంత మేర తీరుతుంది. అందుకు కూడా కమిషన్ స్పందించడం లేదు. వేసవి కావడంతో సమస్య మరింత తీవ్రంగా ఉన్నది. ఈ సమస్యపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి ఫోన్ చేశాను. అధికారులు స్పందించకుంటే ఒక రోజు దీక్ష చేయడానికి కూడా వెనకాడను. **కౌన్సిలర్ మహేశ్**

# అన్యోన్య జీవితానికి ఆదర్శం సీతారాములు

**పట్టు వస్త్రాలు సమర్పించి కళ్యాణంలో పాల్గొన్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, శారద రెడ్డి దంపతులు**



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

: భార్యాభర్తల అనుబంధానికి అన్నదమ్ముల అనురాగానికి, తండ్రి కొడుకుల మమకారానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచే సీతారాములు అందరికీ ఆదర్శప్రాయులని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గోపాల్‌పేట మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ కోదండ రామస్వామి ఆలయంలోని సీతారామ, లక్ష్మణులకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, శారద రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేసి, స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి కల్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులతో స్వామి వారికి కళ్యాణం చేయించారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌పేట ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ సత్యశీలారెడ్డి, మాజీ జెడ్పిటిసి మంద భార్గవి, వనపర్తి మండల మాజీ జెడ్పిటిసి గొల్ల వెంకటయ్య, రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పర్వతాలు, కొంకి వెంకటేష్, శివన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే

**గద్వాల, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** గద్వాల నియోజకవర్గంలోని శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీరాములు దేవాలయంను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులను పొందడం జరిగింది. మల్దకల్ మండలం పరిధిలోని తాటికుంటి గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో, గట్టు మండలం లోని తుమ్మల్ చెర్వు గ్రామంలో, ధరూర్ మండలం లోని ఓబులోనిపల్లి, బూరెడ్డి పల్లిలో, శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఆయన సతీమణి బండ్ల జ్యోతి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహోత్సవ వేడుక సందర్భంగా సీతారాముల కళ్యాణంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీరామ నవమి హిందువులకు ఒక ముఖ్యమైన పండుగ అన్నారు. మగ పిల్లవాడు శ్రీరాముడు వంటి వాడు కావాలని ఆడపిల్లను సీతాదేవి వల్ల ఉండాలని పెద్దలు అంటారు అని ఎమ్మెల్యే తెలిపారు. వీరిద్దరూ సీతారాములు లోకానికి ఆదర్శ దంపతులుగా నిలిచారన్నారు. ఆ సీతారాముల ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం గద్వాల నియోజకవర్గం అన్ని రంగాలలో రైతులు పాడి పరిశ్రమ, విద్యా, వైద్య, అన్ని రకాల వ్యాపార సంస్థలు దినదిన అభివృద్ధి చెందాలి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా స్వామివారిని కోరుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, నాయకులు మధుసూదన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణ రెడ్డి, విజయ్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

# కన్నుల పండువగా శ్రీరాములోరి కళ్యాణం



కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి దంపతులు





శ్రీరాముని ఉత్సవ విగ్రహాన్ని తీసుకొస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్



కళ్యాణోత్సవంలో పాల్గొన్న అలంపూర్ ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 06 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ పట్టణంలోని శ్రీ రామస్వామి దేవాలయంలో శ్రీ రామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే కూచకుళ్ల సరిత రాజేష్‌రెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలు స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించేలా చూడాలని కోరారు. ప్రజలు కూడా ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తూ అత్యవసర పరిస్థితులలో బయటకు రావాలని కోరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఉత్సవ కమిటీ తీసుకున్న చర్యలను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించిన మున్నూరుకాపు సోదరులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మాజీ కౌన్సిలర్స్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం

**హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్, కమిషన్ చైర్ పర్సన్ సీతమ్మ**

**చిన్న చింతకుంట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** మండలంలోని ఆయా గ్రామాలలోని ప్రధాన ఆలయాలలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. దమగ్నపూర్ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ సీతారాముల కల్యాణంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామిని ఎమ్మెల్యే జిఎంఆర్ దర్శించుకున్నారు. శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ సీతారాముల కళ్యాణం వేద పండితులు భక్తిశ్రద్ధలతో జరిపించారు. స్వామివారి కళ్యాణాన్ని కన్నులారా వీక్షించి భక్తులు తరించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో మాజీ జడ్పీ చైర్పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో ప్రధాన ఆలయాలలో శ్రీ సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించి భక్తులకు అన్నదానాలు చేశారు.

### కళ్యాణోత్సవంలో అల్లంపూర్ ఎమ్మెల్యే

**ఇటిక్యాల, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** అలంపూర్ యోజకవర్గంలోని ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామంలో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని ఆదివారం జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు, చల్లా గిరిధర్ రెడ్డి చల్లా అగస్త్య రెడ్డి. హరినాథ్ రెడ్డి. పరమేశ్వర్ రెడ్డి. గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సీతారాముల కళ్యాణోత్సవాన్ని కన్నులారా తిలకించారు.

### ఘనంగా రాములోరి కళ్యాణం

**వెల్దండ, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవాన్ని మండల కేంద్రంతో పాటు చొక్కన్నపల్లి, చెదురుపల్లి, బొల్లంపల్లి, కంటోనిపల్లి రాచూర్‌తో పాటు పలు గ్రామాలలో సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా కనుల పండువగా పురోహితులు నిర్వహించారు. ఈ సందర్భంగా చెదురుపల్లి, బొల్లంపల్లి, చొక్కనపల్లి, వెల్దండ మండల కేంద్రంలోని బుధవార్ పేట ఆంజనేయ స్వామి దేవాలయం బ్రహ్మగిరి దేవాలయాలలోని కళ్యాణోత్సవానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాధవి దంపతులు పాల్గొని కళ్యాణోత్సవాన్ని తిలకించారు. ఎమ్మెల్యే దంపతులను బుధవార్‌పేట కళ్యాణోత్సవ నిర్వాహకులు, పూరి బాలరాజ్, పూరి ప్రకాష్ ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. స్వామివారి కళ్యాణోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై కళ్యాణోత్సవాన్ని తిలకించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వెల్దండ గ్రామం మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనిలా సంజీవ్ యాదవ్, ధ్యాప వెంకట్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, మాజీ జెడ్పిటిసి రాములమ్మ, బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, కాంట్రాక్టర్ శశిపాల్ రెడ్డి, మాజీ ఎంపిటీసీలు చిందం కృష్ణయ్య, జంగయ్యయాదవ్, క్యాసారపు వెంకటయ్య, భయ్య మల్లయ్య, బిజెపి మండల అధ్యక్షులు కుర్మిద్ద యాదగిరి, జంగయ్య, ఎర్ర శ్రీను ముదిరాజ్, పురుషోత్తం చారితోపాటు తదితరులు ఉన్నారు.

### కళ్యాణం..కమనీయం..

మక్తల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఆదివారం మక్తల్ పట్టణంలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన సీతారాముల కల్యాణం భక్తజన సందోహం మధ్య కమనీయంగా కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి దంపతులు సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి కళ్యాణ వేదికపై కొలువు తీర్చారు. అనంతరం అశేష భక్తజన సందోహం, వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా కళ్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, బికేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రాధా లక్ష్మారెడ్డి దంపతులు, మాజీ ఎంపీపీ కొండయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, నాయకులు కట్ట సురేష్, రాజుల ఆశిరెడ్డి, రవికుమార్, కల్లూరి నాగప్ప తోపాటు ధార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు



కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



కళ్యాణోత్సవానికి హజరైన భక్తులు

## ప్రజా ప్రభుత్వంలో సన్న బియ్యం పంపిణీ

**దేశంలోనే ఆదర్శనీయ పథకం**



ఉప్పరపల్లిలో ఉచిత సన్న బియ్యం పంపిణీ

**ఉప్పునుంతల,ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** ధనికులతో పాటు పాటు నిరుపేదలు సన్న బియ్యం తినాలనే మంచి ఉద్దేశ్యంతో సిఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆదివారం మండలంలోని ఉప్పరి పల్లిలో ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి,మాజీ జెడ్పిటసి అనంత ప్రతాపరెడ్డిలు మాట్లాడుతూ దొడ్డు బియ్యం పంపిణీలో జరిగిన అక్రమాలను అరికట్టేందుకు, పేదల సన్న బియ్యం అందించాలని కృతనిశ్చయంతో ప్రజా ప్రభుత్వం ఉందని వారన్నారు. సన్న బియ్యం పంపిణీ దేశంలోనే ఆదర్శ పథకమని వారు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రజల ఆలోచన విధానంలో మార్పు వచ్చినప్పుడు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ జెడ్పిటిసి అనంత ప్రతాపరెడ్డి, ఉప్పరపల్లి మాజీ సర్పంచ్ అనంత ఇంద్రసేనారెడ్డి, మండల రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ బాల్ రాం నాయక్, మాజీ ఎంపిటిసి నాగటి మల్లయ్య , స్థానికులు బొజ్జ అమరేందర్ రెడ్డి,దెంధి గోపాల్ రెడ్డి, అల్వాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం



బిజెపి పార్టీ జండా ఎగరవేస్తున్న నాయకులు

**పెబ్బేరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** పెబ్బేర్ మున్సిపాలిటీ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తా దగ్గర బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బిజెపి పార్టీ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. తరువాత టౌన్ అధ్యక్షుడు క్రాంతి కుమార్ నాయుడు మాట్లాడుతూ బీజెపి పార్టీ దేశంలోనే అతిపెద్ద కార్యకర్తలు కలిగిన పార్టీగా అభివృద్ధి చెందడం జరిగింది. దేశంలో బిజెపి పార్టీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ప్రపంచంలోనే విశ్వగురుస్థానాన్ని చేరుకోవడం జరుగుతుందని దేశంలోనే పెద్ద ఎత్తు నకార్యకర్తలు ఉన్నపార్టీ బిజెపి అని మోడీ ప్రభుత్వంలో పెద్దనోట్ల రద్దు త్రిపుల్ తలాక్ అయోధ్య రామమందిర్ నిర్మాణం 370 ఆర్టికల్ రద్దు వక్స్ బోర్డ్ సవరణ చట్టం బిల్లు వంటి కార్యక్రమాలు చేస్తూ ప్రపంచ దేశాలను భారత వైపుచూసేలా మోడీప్రభుత్వం పనిచేస్తుందని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాసీనియర్ నాయకులు గౌని వేమారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ రంగస్వామి గౌడ్,నాయకులు నరసింహనాయుడు,చింతలరామకృష్ణ,టౌన్ మాజీఅధ్యక్షుడు కంద అంజనేయులు,ఉపాధ్యక్షుడు దిలీప్ రెడ్డి, బలిజ శివ, అరుణ్ కుమార్, రాకేష్ గౌడ్, కుర్వ శ్రీకాంత్, సాయి, గంధం శివమోతె రఘు, కటికె నర్సోజి, మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇటిక్యాల సెంట్రల్ బ్యాంక్ మేనేజర్‌కు చీఫ్ మేనేజర్‌గా పదోన్నతి

**బ్యాంకు ఉద్యోగిగా 38 సంవత్సరాల పాటు ప్రజలకు సేవలు**

**ఇటిక్యాల, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని సెంట్రల్ బ్యాంకులో సీనియర్‌మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న షఫీఉల్లాకు చీఫ్ మేనేజర్‌గా పదోన్నతి పొందినట్లు ఇటిక్యాల సెంట్రల్‌బ్యాంకు సీనియర్ మేనేజర్ షఫీఉల్లా తెలిపారు.1987వ సంవత్సరంలో బ్యాంకుక్లర్కుగా ఉద్యోగం మొదలుపెట్టి 2008లో అసిస్టెంట్ మేనేజర్‌గా 2013మేనేజరుగా 2018లో సీనియర్ మేనేజర్‌గా 2025 ఏప్రిల్ నెల మొదటివారంలో చీఫ్‌మేనేజర్‌గా పదోన్నతి పొందినట్లు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ కర్ణాటక మూడు రాష్ట్రాలలో చీఫ్ మేనేజర్ బాధ్యతలు ఉంటాయని సొంత రాష్ట్రం తెలంగాణ కావడంతో తెలంగాణలోనే చీఫ్ మేనేజర్‌గా బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంటుందని ఈనెల 15న హైదరాబాద్ మెయిన్ బ్రాంచ్‌లో పదోన్నతికి సంబంధించి రిపోర్టు చేయనున్నట్లు 16వ తేదీన తనకు చీఫ్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంటుందని ప్రభాతవార్తకు ఆయన తెలిపారు.

## బీజేపీ 45వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



బిజెపి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**కృష్ణ, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** కృష్ణ మండల కేంద్రంలో బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మరియు మాగనూరు ఉమ్మడి మండలాల బీజేపీ అధ్యక్షుడు నల్లే నర్సప్ప జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం బీజేపీ పార్టీ గతంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులను,ఎదిగిన విధానం గురించి కార్యకర్తలకు వివరించారు. అన్నివర్గాల ప్రజల మన్ననలు పొందుతూ విజయవంతంగా బీజేపీపార్టీ ఒక్కోరాష్ట్రంలో పాగావేస్తూ దూసుకుపోతుందని,యువ నాయకులు నల్లెనరసప్ప అన్నారు. అతి తక్కువ కాలంలో అత్యధిక ప్రజల ఆదరణ పొందుతున్న పార్టీగా, ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అభిమానులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయకౌన్సిల్ సభ్యులు అమరకుమార్ దీక్షిత్, జిల్లా ఉపాధ్యక్షులు సోంశేఖర్ గౌడ్, మండల మాజీ అధ్యక్షులు జి. శ్రీనివాస్‌లు, కొత్తపల్లి సర్పంచ్ తిమ్మప్ప, దండు రాఘవేంద్ర, డీకే కిష్టప్ప, శంక్రప్ప, జిల్లా మహిళా మోర్చా లక్ష్మిసింగ్, బీజేవైఎం నాయకులు సచిన్ బాట్, శివ తదితరులు పాల్గొన్నారు.

## మా భూమి రథయాత్రను విజయవంతం చేద్దాం



మా భూమి రథయాత్ర కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** మక్తల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాధికార సాధన జేఏసీ ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రను ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి రోజు పదివేల కార్లతో అదిలాబాదులో జరగబోయే సభకు నారాయణపేట జిల్లా నుండి బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు,విద్యార్థి సంఘాల నాయకులు అందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు గువ్వల శివరాజ్ మహారాజ్, పోర్ల డేవిడ్, ఈశ్వర్ మహారాజ్, వీరేష్ బలిజ, నరేష్ ముదిరాజ్, అశోక్ మహారాజ్ జి .అంజి, వేణు మహారాజ్, శేఖర్ మహారాజ్, జి.అరుణ్ మహారాజ్, సురేష్, రమేష్, సుధాకర్, వెంకటేష్, శ్రీనివాస్ మహారాజ్ పాల్గొన్నారు.

## డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్‌కు ఆహ్వానం

**బిజినేపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డా. బండ ప్రకాశ్ ముదిరాజ్‌ను మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు ఆహ్వానం పలికారు. తొమ్మిదో తేదీన మండల కేంద్రంలో పూలే విగ్రహావిష్కరణకు హాజరు కావాలని కోరారు. బండ ప్రకాశ్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజు సామాజికవర్గ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని, యువతను ప్రోత్సహించాలని, ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించినట్లు తెలిపారు. ముదిరాజ్‌లు సంఘటితంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని అన్నారు. వర్గాలుగా విడిపోతే ప్రభుత్వాలు గుర్తించవని, ఏకతాటికపై వస్తే అడిగే స్థాయి నుంచి ఇచ్చే స్థాయికి ఎదగవచ్చని అభిప్రాయపడ్డారు. ఆహ్వానం పలికిన వారిలో జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగన్న మోని కిరణ్, విగ్రహావిష్కరణ కమిటీ అధ్యక్షులు అంతటి రాజేందర్ గౌడ్, దళిత బహుజన రాష్ట్ర నాయకులు మంగి విజయ్, సత్యశీల సాగర్, సిద్దుల శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**వెల్దండ, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల పార్టీ అధ్యక్షులు కుర్మిద్ద యాదగిరి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ అవినీతి రహిత సుస్థిర పాలనను అందించేది బీజేపీ పార్టీ అని దేశ ప్రజలందరూ బీజేపీ పార్టీని కొనియాడుతున్నారన్నారు. కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జి వై.శేఖర్ రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జంగయ్యయాదవ్, తంబాలు, తాటికొండ కృష్ణారెడ్డి, గుద్దటి రామస్వామి, శ్రీశైలం ముదిరాజ్, విష్ణు గౌడ్, కొండల్ ముదిరాజ్, శ్రీశైలం, కుమార్ గేలువయ్యతోపాటు తదితరులు ఉన్నారు.

## సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మకం

**ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ**

**అప్పాయిపల్లిలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించిన డీసీసీబీ ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు డి. శంకర్‌రావు**



సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని,ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఇంటింటికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయడం చారిత్రాత్మకమైనదని, డీసీసీబీ ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు డి.శంకర్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వనపర్తి మండలం అప్పాయి పల్లి గ్రామంలోని రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని డీసీసీబీ ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు డి. శంకర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సామాన్యులకు సంపన్నులకు సమాన భోజనం అందించాలన్న ఉద్దేశంతో సన్నబియ్యాన్ని పంపిణీ చేసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఈ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంతో ప్రభుత్వానికి రూ. 5173 కోట్లు అదనంగా భారం పడుతుందని అయినా నిరుపేదలు సైతం సన్న బియ్యంతో భోజనం చేయాలన్న తలంపుతో ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వనపర్తిలో 324 రేషన్ దుకాణాలకు సంబంధించి ప్రతినెల 3309మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి 1,59353 తెల్ల రేషన్ కార్డు దారులకు ఒక్కొక్కరికి 6 కేజీల చొప్పున 5,22,363 మందికి ఈ సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డి.రామారావు, మాజీ ఉప సర్పంచ్ డి. రాంచందర్ రావు,కాంగ్రెస్ నాయకులు వి. బుచ్చన్న, వి. శ్రీనివాసులు, విఓఎబి కరుణాకర్, చిన్న వెంకటయ్య, రేషన్ షాపు డీలర్ డి. సరళ, బసరత్ ఆనంద్, కాశమోని చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీతా దయాకర్ రెడ్డిని సత్కరించిన మఖ్తల్ ఎమ్మెల్యే



సీతా దయాకర్ రెడ్డిని సన్మానిస్తున్న మఖ్తల్ ఎమ్మెల్యే

**ఆత్మకూరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర బాలా హక్కుల పరిరక్షణ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన దేవరకద్ర మాజీ శాసన సభ్యురాలు సీతా దయాకర్ రెడ్డి నీ మఖ్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదివారం ఘనంగా సత్కరించారు. చిన్న చింతకుంట మండలంలోని ప్రకాపురం గ్రామంలో సీతా దయాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా మఖ్తల్ నియోజకవర్గం సభ్యులు వాకిటి శ్రీహరి కలిసి ఘనంగా చాలువాతో సత్కరించి భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షిస్తూ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మఖ్తల్ నియోజకవర్గం లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి కోసం కలిసి పని చేద్దామని స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరం కంకణబద్ధులై పని చేద్దామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సీతా దయాకర్ రెడ్డితో చర్చించినట్లుగా కాంగ్రెస్ నేతలు ప్రభాతవార్తకు వివరించారు. ఎమ్మెల్యే వెంబడి మఖ్తల్ నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు తులసిరాజు యాదవ్, ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరమేష్, మాజీ మండల అధ్యక్షుడు రహమతుల్లా, మున్సిపాలిటీ అధ్యక్షుడు నల్లగొండ శ్రీనివాసులు, మఖ్తల్ నియోజకవర్గ నాయకులు చంద్రకాంత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలను తిరస్కరించండి: సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి

**ఆత్మకూరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మతవిద్వేషణలను తిరస్కరిస్తూ ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం రోజు ఆత్మకూరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 8న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించినట్లుగా ఆయన తెలిపారు. గత రెండు పర్యాయాలు బిజెపి అధికారంలో కొనసాగినప్పటికీ దేశంలో ఏమాత్రం నిరుద్యోగాన్ని నిర్మూలించలేకపోయిందని మరో మారు అధికారం చేపట్టేందుకు ఇప్పటినుండే మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య చీలిక తెచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రజాస్వామికవాదులు అందరూ తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో ప్రధాన సమస్యలైనా రైతుల సమస్యలను పరిచయమైన పెట్టడమే కాకుండా మహారాష్ట్రలో అనవసరమైన పతవిద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రధాని మోడీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు.

## యువత అన్ని రంగాల్లో ముందుండాలి

**ఊట్కూరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** ఊట్కూరు మండల పరిధిలోని అమీన్పూర్ గ్రామంలో ప్రీమియర్ లీగ్ సీజన్ వన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం జరిగింది. మొదటిసారి అమీన్ పూర్ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం చేయడం మంచి శుభసూచకం అన్నారు. టోర్నమెంట్‌ని యన్.సుధాకర్ రెడ్డి మాజీ మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు మాజీ ఎంపిటిసి భర్త అయినటువంటి శేఖర్ రెడ్డి మైనారిటీ నాకు మమ్మద్ షమీ శాసముల రవీందర్ రెడ్డి ఓబ్లపూర్ మాజీ సర్పంచ్ భీం రెడ్డి ,ఆర్గనైజర్ల కొండపురం రాజు, ఆంజనేయులు, తీ మైబు గ్రామ ప్రజలందరూ కలిసి ఈ టోర్నమెంట్ ప్రారంభించడం జరిగింది. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మొదటి బహుమతిగా కీ॥ అయినటువంటి యన్.నారాయణ రెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ ఊట్కూరు జ్ఞాపకార్థం రూ.22,222 వారి కుమారులు యన్.శివారెడ్డి, యన్.సుధాకర్ రెడ్డి, యన్.రాంరెడ్డి ఇవ్వడం జరిగింది. రెండవ బహుమతి కీ॥ హన్మిరెడ్డి కుమారులు ఆశి రెడ్డి రవీందర్ రెడ్డి రూ. 11,111, ట్రోఫీలు అశోక్ గౌడ్ పంచాయతీ సెక్రెటరీ, బాల్సను మహమ్మద్ సాఫీ, కీ॥ జములప్ప కుమారులు చాకలి బాబు, కూల్ వాటర్, శేఖర్ రెడ్డి మాజీ ఎంపిటిసి, పూజారి అంజప్ప, గ్రౌండ్ క్లీనింగ్ గ్రౌండ్ మేనేజ్మెంట్, టెంట్ సౌండ్ బాక్స్ టపా నాగేష్ ఏర్పాటు చేశారు. చివరి రోజు అన్నదాన కార్యక్రమాన్ని చాపల భీమసేన్ చేయడం జరుగుతుంది. మొదటి మ్యాచ్ అమీన్ పూర్ పగడి మర్రి గ్రామాల మధ్య పోటీ జరిగినది. టోర్నమెంట్‌ని అమీన్ పూర్ గ్రామ యువత అయిన కొండాపురం రాజు, చింతలొల్ల ఆంజనేయులు, బుక్క మైబు, మకలి మల్లేష్, నిర్వహిస్తున్నారు. అందరూ గ్రామ ప్రజలు సహకరించాలి కోరారు.

## శ్రీ తిమ్మప్ప స్వామికి బంగారు నామం వితరణ



**మల్దకల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయానికి కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం మాధవవరం గ్రామానికి చెందిన కురువ జయరాములు, సుజాత దంపతులు నాలుగు గ్రాముల బంగారు నామం బహుకరించారు. ఈ సందర్భంగా అర్చకులు రవి, వాల్మీకి పూజారులు దేవస్థానంలో పూజలు నిర్వహించి వారికి స్వామి వారి శేష వస్త్రం బహుకరించారు.

## తిమ్మాపురంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

**ఇటిక్యాల, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో ఆదివారం భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు గ్రామానికి చెందిన బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అలాగే గ్రామ అంబేద్కర్ యువజన సంఘ సభ్యుల ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు.

## దేవాలయ నిర్మాణానికి విరాళం

**వెల్దండ,ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** మండలంలోని పోతేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి ఆదివారం గ్రామానికి చెందిన వరికుప్పల పుల్లయ్య కుమారులు రూ.21వేలు,అదేవిధంగా చెల్లమల్ల రోశయ్యగౌడ్ రూ.10 వేలవిరాళాన్ని మాజీసర్పంచ్ వావిలాల వెంకటమ్మకు అందజేశారు. కార్యక్రమంలో కిరణ్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ తాంద్ర పెద్ద సైదయ్య, తొడుగుల యాదయ్య, పత్తి వెంకటయ్య, వడ్డె మల్లికార్జున్, కృష్ణయ్య, శేఖర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యేని కలిసిన గిరిజన యువకులు

**బిజినేపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ద న్ రెడ్డిని లట్టుపల్లి పరిధిలోని ఎర్రకుంట తండా గ్రామపం చాయతీ యువత కలిసి ఆదివారం జన్మదిన శుభాకాంక్షలు తెలి పారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన తండాలు ఎంతో అభివృద్ధి చెందాయని ఈ ప్రాంత గిరిజనులు మర్రి జనార్దన్ రెడ్డి సేవలను ఎన్నటికీ మరచిపోరని కృతజ్ఞతలు తెలిపారు. మర్రిని కలిసిన వారిలో మాజీ సర్పంచులు రాము నాయక్,లింబియా నాయక్, వంశీ నాయక్, నరేందర్, శ్రీను, హనుమంతు, నరేష్, శ్రీకాంత్, రమేష్, రాజు లక్ష్మణ్ ఎర్రగుంట తండా గ్రామపంచా యతీ గిరిజన యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పిడికి ప్రత్యేక అభినందనలు

**మక్తల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** ఇటీవల ఒడిస్సా రాష్ట్రంలోని పూరి పట్టణంలో జరిగిన జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో మక్తల్ మండలంలోని కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిడి బి.రూప తెలంగాణ రాష్ట్ర జట్టుకు టెక్నికల్ అఫీషియల్‌గా వ్యవహరించి సమర్థవంతంగా టోర్నీని నిర్వహించడం పట్ల ఖోఖో అసోసియేషన్ తరపున ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవ రెడ్డి, కార్యదర్శి కృష్ణమూర్తి, మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, కార్యదర్శి విలియం, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.గోపాలం, నిర్వహణ కార్యదర్శి బాల రాజయ్య, పాఠశాల జిహెచ్ఎం వెంకటయ్య గౌడ్, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

# వైభవంగా సీతా రామచంద్రస్వామి కళ్యాణోత్సవం


ఉప్పునుంతలలో జరిగిన సీతారాముల కళ్యాణోత్సవం


తలంబ్రాలు అందజేస్తున్న వాకిటి శ్రీధర్ రమేష్ చంద్ర


ఆత్మకూరులోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ..


అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం

**ఉప్పునుంతల, ఏప్రిల్6 ప్రభాతవార్త:**శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని ఆదివారం మండలంలో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల శ్రీ కేదారేశ్వర, చెన్నకేశవ ఆలయంలో సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. వధువు తరఫున కొత్త చిన్న జంగిరెడ్డి, యశోద, వరుడు తరఫున కట్ట నారాయణ రెడ్డి, సుగుణమ్మ దంపతులు కూర్చొని వివాహం జరిపించారు. కళ్యాణోత్సవం తిలకించేందుకు గ్రామపెద్దలు తిప్పర్తి రుక్మారెడ్డి,కట్ట గోపాల్ రెడ్డి, కొత్త పెద్ద జంగిరెడ్డి,కట్టచంద్రారెడ్డి,కట్ట చిన్నజనార్దన్ రెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ అనంత ప్రతాప్ రెడ్డి, ఎస్సై వెంకట్ రెడ్డి దంపతులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ కట్ట సరిత,పాపి శెట్టి కుమారస్వామి, సింగిల్ విండో డైరెక్టర్ సూరం నారాయణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ మోర లింగమయ్య, సూరం వెంకట్ రెడ్డి, పెద్దిరెడ్డి బూషి రెడ్డి, కర్ణాటి సత్యం, మాజీ సింగిల్ విండో చైర్మన్ తిప్పర్తి జగన్మోహన్ రెడ్డి,కట్ట షణ్ముఖ రెడ్డి, కదిరే కృష్ణయ్య, ఆలయ కమిటీ నిర్వాహకులు,మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**పోలీస్ బందోబస్తు....** మండల కేంద్రమైన ఉప్పునుంతల శ్రీ కేదారేశ్వర ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల భాగంగా ఆదివారం జరిగిన కళ్యాణోత్సవం, కోలాటం పోటీలకు ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. సీతారాముల కళ్యాణోత్సవం ముగిసిన తర్వాత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఎక్కడ ఎలాంటి జరగకుండా పోలీసులు చాలా జాగ్రత్త వహించి ఎలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

**అన్న దాన కార్యక్రమం.....** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉప్పునుతల శివాలయంలో జరిగిన సీతారాముల కళ్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులకు కొత్త యశోద ఫంక్షన్ హాల్ ప్రొ॥ కొత్త చిన్న జంగి రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**మరో శిరసన గండ్లను తలపించిన శ్రీరామ గట్టు...** మండలంలోని కాంసాని పల్లి సమీపంలో ఉన్న శ్రీరామ గట్టుపై గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. అచ్చంపేట నియోజక వర్గంలోని రెండో సిసనసగండ్లను తలపించేలా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కళ్యాణ మండపంలో భారీ జన సమూహం మధ్య సీతారాముల కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది. సీతారాముల కొట్టే శ్రీను వాసులు దంపతులు, కట్ట అచ్యుతా రెడ్డి దంపతులు కూర్చొని సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సాహ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అన్న దాన కార్యక్రమం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కంసాని పల్లి గ్రామానికి చెందిన పోల సాయిబాబు ఆర్థిక సహకారంతో సీతారాముల కళ్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా అయ్యవారిపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ చెన్ రెడ్డి యాదిరెడ్డి ఊర్మిళ దంపతులు, నాగర్ కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జిల్లెల జగత్ రెడ్డిల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగింది. ఉప్పరపల్లి, మామిళ్ళపల్లి, పెనిమిళ్ళ, వెల్టూర్ ,తాడురు గ్రామాల్లో సీతారాముల కళ్యాణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## సీత రాములవారికి ముత్యాల తలంబ్రాలు

**ముత్యాల తలంబ్రాలను సమర్పించిన మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ఆర్సీ జువెలర్స్ అధినేత రమేష్ చంద్ర**

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** సీతారాముల కళ్యాణం సందర్భంగా వనపర్తి పట్టణంలోని అన్ని దేవాలయాల్లో సీతారాముల వారికి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ రమేష్ చంద్ర ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. వేలాది మంది భక్తులు పాల్గొన్న కళ్యాణాల్లో శ్రీ సీతారామ కళ్యాణం ఘనంగా జరిగింది. రామాలయం వెంకటేశ్వర దేవాలయం బాలాంజనేయ కన్యకాపరమేశ్వరి, నాగవరం మర్రికుంట, పీర్లగుట్ట, రాంనగర్ కాలనీ రాజానగరం, జగత్పల్లి, అచ్యుతాపురం దేవాలయాల్లో ముత్యాల తలంబ్రాలు అందచేశారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని రామరాజ్యం రావాలని తెలంగాణలో రామరాజ్యం తేవడం కేవలం కెసిఆర్‌కు మాత్రమే సాధ్యం అవుతుందని మళ్లీ కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి కావాలని పూజలు చేశారు. కార్యక్రమంలో ఉంగ్లం తిరుమల్,ఆవుల రమేష్, బాలేశ్వరయ్య, విశ్వనాథం, కలకొండ అనంతమ్మ, జగదీష్ పాల్గొన్నారు

## ఘనంగా సీతారాముల కళ్యాణం

**ఆత్మకూరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా కోట్లాది ప్రజలు శ్రీరామ నవమి జరుపుకుంటున్న శుభ తరుణంలో ఆదివారం మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సీతారాముల కళ్యాణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు మాజీ ఎంపీపీ శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో కొనసాగిన సీతారాముల కళ్యాణోత్సవానికి పట్టణం నుండే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజల సైతం పెద్ద ఎత్తున తరలివచ్చి సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. వేద పండితులు మంత్రోత్సవాల మధ్య భాజా భజంత్రీలతో పెద్ద ఎత్తున నిర్వహించిన సీతారాముల కళ్యాణం ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆత్మకూరు మండల పరిధిలోని బాలకృష్ణాపూర్ గ్రామ సమీపంలో బాలాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణోత్సవానికి సైతం భక్తులు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణాన్ని తిలకించారు. ఆయా కార్యక్రమాలలో ఆత్మకూరు పట్టణ ప్రముఖులు మాజీ మున్సిపల్ చైర్మన్ గాయత్రీ రవికుమార్ యాదవ్‌తో పాటుగా పలు రాజకీయ పార్టీల చెందిన నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్టలు

**మల్దకల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఏల్కూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల ఆంజనేయ లక్ష్మణ దేవాలయ శిలా మండపంలో విగ్రహ ప్రతిష్టలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ప్రముఖ విగ్రహ ప్రతిష్టాపన రమేషాచారి, ఆధ్వర్యంలో శశాంక దాస్, రాఘవేంద్ర దాస్, ప్రసన్న, ప్రాణేష్, నరేష్, ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య విగ్రహ ప్రతిష్టలు కన్నుల పండుగగా జరిగాయి. మూడు రోజుల పాటు జరిగిన ప్రతిష్ట కార్యక్రమంలో గ్రామస్తులు నాగేష్ చక్రధర్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పూజలు అభిషేకాలు నిర్వహించారు.

**కన్నుల పండుగగా శ్రీ సీతారాముల కళ్యాణం...** శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా


బీచుపల్లి కోదండ రామాలయంలో

నిర్వహించారు. నూతనంగా నిర్మించిన దేవాలయం ఆవరణలో జరిగిన కళ్యాణానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

## కూచూరులో ఘనంగా రామనవమి వేడుకలు

**నవాబుపేట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** శ్రీరామనవమి వేడుకలకు ఆదివారం మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని కూచూరు గ్రామంలో గ్రామ ప్రజా ప్రతినిధులు ఆలయ ధర్మకర్త మండలి సభ్యుల ఆధ్వర్యంలో కన్నుల పండుగ శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవం జరుపుకున్నారు. సీతారాముల ఆంజనేయస్వామి రథోత్సవాన్ని ఊరంతా ఊరేగింపు చేశారు. డా. పెరుమల్ల శ్రీనివాస్ రెడ్డి, పెరుమల నరసింహారెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికి ఆలయ ప్రాంగణం వరకు భజన మండలితో భాజా భజంత్రీలతో ఊరేగింపు చేశారు. గ్రామ వాస్తవ్యులు పట్నం మల్లయ్య ఆంజనేయస్వామి ప్రతిమలను ఇత్తడి విగ్రహాలను గ్రామ తిరుమల గుడి గ్రామ హనుమాన్ గుడికి విరాళంగా ఇచ్చి తన భక్తిని చాటుకున్నారు. అలాగే పెరుమల నరసింహారెడ్డి, శివ శేష పాలధార పాత్రను వితరణ చేసి తన భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీరామనవమి తీర్థ ప్రసాదాలను స్వీకరించి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతా రామచంద్రస్వామి కళ్యాణోత్సవం

**పాల్గొన్న జికేఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజశేఖర్**

**దేవరకద్ర, ఏప్రిల్6, ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం పరిధిలోని చిన్న రాజమూర్ గ్రామంలో ఆంజనేయ స్వామి టెంపుల్ వద్ద ఆదివారం సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. కళ్యాణోత్సవంలో రాష్ట్ర మేదరి సంఘం ప్రధాన కార్యదర్శి, జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోన రాజశేఖర్ పాల్గొన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో ఆంజనేయ స్వామి టెంపుల్ ఆవరణలో ఆలయ అర్చకులు గ్రామస్తుల సహకారంతో కళ్యాణఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. సీతారాములకు నూతన వస్త్రాలతో కళ్యాణం జరిపించారు. ఎక్కడ చూసినా రామ రామ జపంతో ఆలయం పరిసరాలు మార్మోగాయి. అర్చకులు హోమముతో సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సీతారాముల కళ్యాణం కమనీయం

**బిజినేపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆయా గ్రామాల్లో భారీగా తరలివచ్చిన భక్తుల సాక్షిగా అర్చకులు సీతారాముల కల్యాణం జరిపించారు. ఆదివారం ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపాల్లో సీతారాముల విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి రాములవారితో సీతమ్మ మెడలో తాళి కట్టించారు. ఈ కమనీయమైన వేడుకను చూసి భక్తులు తరించిపోయారు. లట్టుపల్లి జగిన తండాలో రాత్లావత్ మాను నాయక్ అంజలి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సీతారాముల కల్యాణంలో కూర్చొని మహోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణం అనంతరం పలు ఆలయాల్లో అన్న ప్రసాద కార్యక్రమాలు చేపట్టారు. కళ్యాణ మహోత్సవంలో కూచుకుల్ల సుహాసన్ రెడ్డి, మాజీ సర్పంచులు వెంకట్ రెడ్డి, గుండ్లపల్లి శేఖర్ రెడ్డి, హరీష్ రెడ్డి, రాజేందర్, వీరేష్ ,,మణెమ్మ, మాన్ సింగ్, పాలెంలో మాజీ ఎంపీపీ పుష్పాల సుమలత శ్రీనివాస్ గౌడ్, మహేశ్వర్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

## వైభవోపేతంగా శ్రీ సీతారాములోరి కళ్యాణం

**ఆలయంలో పోటెత్తిన భక్తజనం**

**లింగాల, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** శ్రీ కోదండరామాలయంలో ఆదివారం శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం వైభవోపేతంగా వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య సాంప్రదాయంగా నిర్వహించారు. ఆలయానికి ఉత్తర దిక్కున ఉన్న కళ్యాణ వేదికను రకరకాల పూలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. స్వామివారి కళ్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం రాత్రి ఎదుర్కోళ్ళు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ పూజారి భాస్కర్ దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. తలంబ్రాలు ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు. మండల కేంద్రానికి చెందిన సావిత్రమ్మ, యాదగిరి దంపతులు అమ్మవారికి మంగళసూత్రాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణం తిలకించడానికి వివిధ మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల సౌకర్యార్థం కొరకు తరంగిణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయంలో శ్రీనివాస గోవిందా నామస్మరణతో మారుమోగింది. అదే విధంగా మండలంలోని అంబట్‌పల్లి, కోమటికుంట,శాయిన్ పేట తదితర గ్రామాల్లో శ్రీ సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు రామాచార్యులు, సుదర్శనచార్యులు, సింగిల్ విండో చైర్మన్ ఆనంద్ రెడ్డి, మాజీ సర్పంచ్ నాగ రవి శంకర్, కమిటీ సభ్యులు వెంకటయ్య, రాజాలు, బాలాజీ నాయక్, నరేందర్, శ్రీనివాసులు, భక్తులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా సీతారామల కళ్యాణం

**-వేదమంత్రాలు, మంగళ వాయిధ్యాలు ఒక్కటైన సీతారాముల కళ్యాణం..**

**కల్వకుర్తి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని హనుమాన్ దేవాలయం వద్ద ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణం కన్నుల పండువగా వేదమంత్రోచ్ఛరణలు, మంగళ వాయిధ్యాలతో వేలాది మంది భక్తుల సమక్షంలో శ్రీ సీతారామస్వామి దంపతులు ఒక్కటయ్యారు. రాముల వారి తరపున పట్టణానికి చెందిన నరేందర్ రెడ్డి దంపతులు, సీతమ్మ వారి తరపున శ్రీశైలం దంపతులు వారి ఇండ్ల నుంచి మేళతాళాలతో విగ్రహాలను ఊరేగింపుగా బాణసంచా కాలుస్తూ కళ్యాణ మండపం వద్ద తీసుకొచ్చారు. అనంతరం పూజారులు అంగరంగా వైభవోపేతంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులకు వాకింగ్ సిండికేట్ ఆద్వర్యంలో మజ్జిగా ప్యాకెట్లు, మహాలక్ష్మి సిండికేట్ ఆధ్వర్యంలో పానకం పంపిణీ చేశారు. వేసవి కాలంలో భక్తులకు ఎండ వేడిమి తగలకుండా చలువ పందిరిలు ఏర్పాటు చేశారు. కళ్యాణం అనంతరం అక్కడే దేవాలయం కమిటీ భక్త బృందం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన బోజన ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా జరిగిన శ్రీరాముల కళ్యాణ మహోత్సవం

**శ్రీరంగాపూర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల్ కంబాలపురం గ్రామంలో శ్రీరాములవారి కళ్యాణ మహోత్సవం కార్యక్రమం ఎంతో వైభవంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం పాలాది చింతయ్య కవిత దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం, అదే విధంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అదేవిధంగా సాయంత్రం ఊరేగింపు కార్యక్రమం అందులో భాగంగా భజన పాటలతో, కోలాటాలతో ఎంత వైభవంగా జరపడం జరి గింది. ఈ కార్యక్రమంలో భక్తులు,గ్రామ ప్రజలు, యువకులు పాల్గొనడం జరిగింది.

## బీచుపల్లిలో వైభవంగా సీతారాముల కళ్యాణం

**రామనామ స్మరణతో మారుమోగిన బీచుపల్లి**

**పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు**

**ఇటిక్యాల, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కృష్ణా నాది సమీపాన వెలసిన శ్రీ కోదండరామ ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి పునర్వసు జన్మ నక్షత్రం అభిజిత్ లగ్నమందు వేద పండితుల మధ్య జరిగిన సీతారాముల కళ్యాణం వైభవంగా కన్నుల పండుగగా కొనసాగింది. సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు పెబ్బేరు, వనపర్తి చుట్టుపక్కల గ్రామాలు అలాగే జోగులాంబ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్వామివారి కల్యాణోత్సవానికి హాజరై కన్నులారా తిలకించి స్వామి వారి కృపకు పాత్రులు అయ్యారు. బీచుపల్లిలో జరిగిన సీతారాముల కళ్యాణోత్సవానికి జిల్లా జడ్జి కుషా, డీఎస్పీ మొగులయ్య హాజరై కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారి కళ్యాణోత్సవం సందర్భంగా బీచుపల్లి లో రామనామ స్మరణతో మారుమోగింది. ఈ సందర్భంగా సీతారాముల కళ్యాణో త్సవానికి హాజరైన భక్తులకు హైదరాబాద్ కు చెందిన బాలకృష్ణారెడ్డి, అభిజ్ఞరెడ్డి, అభిరాం రెడ్డి, రంగారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అంతేకాక మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలోని ఆలయాలలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు.

## తాటికుంట, శేషంపల్లిలో ఘనంగా సీతారాముల కళ్యాణం

**భక్తులతో కిక్కిరిసిన దేవాలయాలు**

**మల్దకల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో, వాడవాడలా చలువ పందిర్లు వేసి సీతారాముల కళ్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య జరిగిన స్వామివారి కళ్యాణాన్ని తిలకించేందుకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులకు సీతారాములకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయాల కమిటీలు, ఆయా సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. తాటికుంట పట్టాభి సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి దంపతులు, మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్ రెడ్డి దంపతులు, శేషంపల్లిలో ఆంజనేయ స్వామి దేవాలయంలో జనార్దన్ రెడ్డి దంపతులు, నందివర్ధన్ రెడ్డి దంపతులు స్వామివారి కళ్యాణోత్సవాన్ని జరిపించారు. కుర్తి రావులచెరువు, బిజ్వారం అమరవాయి, పాల్వాయి, నాగర్ దొడ్డి, మద్దెలబండ, పెద్దొడ్డి, మల్దకల్ తదితర గ్రామాలలో శ్రీరామనవమి ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాప్, నరసింహారెడ్డి ఆంజనేయులు, పటేల్ శ్రీనివాస్ రెడ్డి, పటేల్ జనార్దన్ రెడ్డి, బెల్లం నర్సింనాయుడు, తదితరుల పాల్గొన్నారు. ఈ కళ్యాణోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లాలో వైభవంగా సీతారాముల కల్యాణం

**హాజరైన బీసీ పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ దంపతులు**

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని వనపర్తి జిల్లాలో సీతా రాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఏదుల మండల కేంద్రంలోని ఎర్రగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో, కొత్తకోట మున్సిపాలిటీలోని రాఘవేంద్ర స్వామి ఆలయంలో పెద్దమందడి మండలం చిల్కటోనీపల్లి గ్రామంలో నిర్వహించిన కళ్యాణోత్సవ వేడుకలకు బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలకు విచ్చేసిన రాచాల దంపతులను స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ సీతారాముల వారి చల్లని దీవెనలతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, ఈ ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురిసి, మంచి పంటలు పండి, రైతులకు అధిక రాబడి రావాలని ఆకాంక్షించారు. అదేవిధంగా విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని పార్లమెంటులో ఆమోదం పొందేలా చూడాలని సీతా రాములను ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, ఏదుల మాజీ సర్పంచ్ మశన్న, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్ గౌడ్, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, ఏదుల మండల అధ్యక్షుడు హనుమంతు, ప్రధాన కార్యదర్శి జానకిరామ్, పెద్దమందడి మండల అధ్యక్షుడు రమేష్ సాగర్, రామన్ గౌడ్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల కళ్యాణం

**పెబ్బేరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలో ఆదివారం సీతారాముల వారి కళ్యాణం సందర్భంగా పట్టణంలోని భక్తాంజనేయ స్వామి ఆలయం, వీరంపేట ఆంజనేయ స్వామి దేవాలయం, వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం, గణేష్ నగర్ శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో, పాలు గ్రామాలలో అంగరంగ వైభవంగా సీతారాముల వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఆలయం దగ్గర అన్నప్రసాదాలు వితరణ చేసి భక్తాదులు వారు శక్తి కొలది ఏర్పాట్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పట్టణ ప్రముఖులు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.


కళ్యాణోత్సవానికి హాజరైన భక్తులు


స్వాములవారి కళ్యాణంలో పాల్గొన్న భక్తులు


అంగరంగవైభవంగా సీతారాముల కళ్యాణం


సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న రాచాల దంపతులు


సీతారాముల వారి కళ్యాణం


కళ్యాణోత్సవానికి అధిక సంఖ్యలో హాజరైన భక్తులు


రథోత్సవం ముందు భజనలు చేస్తున్న దృశ్యం


కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


బిజినేపల్లిలో సీతారాముల కళ్యాణ మహోత్సవం



## దేశ చరిత్రలో..నూతన అధ్యాయం

**- వక్ఫ్ సవర్ణ బిల్లు జాయింట్ పార్లమెంటరీ కమిటీ సభ్యురాలు, ఎంపీ డీకే అరుణ**

**- వక్ఫ్ బిల్లుకు చట్టబద్ధత కల్పించడంపై హర్షం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** దేశ చరిత్రలో మరో కీలక ఘట్టం, కీలక ఆధ్యాయం లిఖితమైందని, వక్ఫ్ సవరణ బిల్లుకు శ్రీరామ నవమి రోజునే చట్ట బద్ధత కల్పించడం శుభతరుణం అని వక్ఫ్ సవర్ణ బిల్లు జాయింట్ పార్లమెంటరీ కమిటీ సభ్యురాలు, ఎంపీ డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. దేశంలోని వేలాది మంది వక్ఫ్ బాధితులకు న్యాయం జరగబోతోందని, దేశంలో వక్ఫ్ పేరుతో లిటిగేషన్ లో ఉన్న వేల ఎకరాల భూములుకు రిలీఫ్ రాబోతోందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింల ఆస్తులు, మసీదులు, కబరస్తానలు తీసుకుంటారు, గుంజుకురాని జరిగిన ప్రచారం అవాస్తవం అని, ఇలాంటివేమీ లేవని ఇప్పటికైనా ముస్లిం సోదరులు, ప్రజలు తెలుసుకోవాలిలని పేర్కొన్నారు. వక్ఫ్ పేరుతో జరిగిన మోసాలకు ఈ చట్టంతో చెక్ పడిందన్నారు. అందరికీ న్యాయం చేసేందుకే.. వక్ఫ్ బోర్డు ఏర్పాటు ఉద్దేశ్యం ఇన్నాళ్లు నెరవేరలేదని, ఇకపై అసలైన ముస్లిం మహిళలు, వితంతువులకు న్యాయం జరగనుందన్నారు. వక్ఫ్ పేరుతో ఇన్నాళ్ల కొందురు చేసిన అక్రమాలకు చెక్ పడిందని, ఈ బిల్లు చట్టరూపం దాల్చిన సందర్భంగా దేశ ప్రజలందరికీ ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలిపారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదం తర్వాత ఇవాళ దేశ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆమోదం తెలపడం హర్షనీయం, అభినందనీయమన్నారు. వక్ఫ్ బిల్లుకు చట్టం రూపం ఇస్తూ ఉత్తర్వు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వక్ఫ్ బిల్లు చట్టం రూపంలో తీసుకురావడంలో ప్రత్యేక కృషి చేసిన ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్ షా, మైనారిటీ శాఖ మంత్రి కిరన్ రిజిజుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

## మళ్లీ బోరింగ్ బాట..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

రాకపోవడంతో జనాలు బోరింగ్, బోరు బావుల బాట పడుతున్నారు. కావేరమ్మపేట కార్యాలయం సమీపంలో ఒక పురాతన బావి ఉన్నదని, అందులో ఏడాది పొడవునా నీరు పుష్కలంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. బావి వద్ద ఒక మోటారు బిగిస్తే వస్తే ఐదారు వార్డులకు సరిపడా నీరు అందించ వచ్చని కమిషనర్ సారు, అధికారులు అదీ చేయడం లేదని చెబుతున్నారు. కావేరమ్మ పేటలో నీటి సమస్య నిరంతరయంగా వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఫోన్లు చేస్తే కూడా రెస్పాండ్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంప్ హౌస్ నుంచి వచ్చే నీటి విషయంలో అలసత్వం వహిస్తున్నారని, నిరంతరం సరఫరా అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయమై మున్సిపల్ ఏఈ గాయిత్రీని వివరణ కోరగా మల్లెబోయిన్‌పల్లి గ్రిడ్ నుంచి ప్రతి రోజు 11ఎంఎల్‌డీ కావాల్సి ఉన్నది. ఆదివారం 3.5ఎంఎలడీ మాత్రమే సప్లై అయింది. శనివారం వాల్వ్ ఫెయిల్ కావడం వల్ల 14గంటలు షట్ డౌన్ ఉన్నదని తెలిసిందని చెప్పారు.

## రక్త దాత నటరాజ్‌కు మానవత వీరుడు అవార్డు

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** అత్యధిక సార్లు రక్త దానం చేసి రక్తదాతగా పేరొందిన రెడ్ క్రాస్ సంస్థ మహబూబ్‌నగర్ చైర్మన్ లయన్ డాక్టర్ అంబటి నటరాజ్‌కు జాతీయ స్థాయి లో మానవత వీరుడు( హీరో ఆఫ్ హ్యూమానిటీ) అవార్డు లభించింది. జిల్లా రక్తదాతలు, ప్రేరేపకుల ఫోరం కోరాపుట్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదానం పై ఒడిషా రాష్ట్రం (కోరాపుట్ లోని మున్సిపల్ ఆ డిటోరియల్) లో ఈ నెల 5,6 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ కాన్ఫరెన్స్ ముగింపు సందర్భంగా జాతీయ స్థాయిలో వందకు పైగా రక్త దానం చేసిన రక్త దాతలకు మానవత వీరుడు అవార్డులను ప్రదానం చేశారు. అయితే 167 సార్లకు పైగా రక్తదానం చేసి సమాజానికి స్ఫూర్తిగా నిలిచిన లయన్ నటరాజ్ కు మానవత వీరుడు అవార్డును ప్రదానం చేశారు. కోరా పుట్ జిల్లా కలెక్టర్ కీర్తి వాసన్, ఎమ్మెల్యే రఘు రామ్, జిల్లా రక్త దాతల, ప్రేరేపకుల ఫోరం ( డి బి డి యం ఎఫ్) అధ్యక్షులు సంజీవ్, కార్యదర్శి షేక్ ఇబ్రహీం ల చేతుల మీదుగా లయన్ నటరాజ్ మానవత వీరుడు అవార్డు అందుకున్నారు. అత్యధిక సార్లు రక్త దానం చేయడం తో పాటు గత ఏడాది రాష్ట్ర పతి నుంచి అవార్డు అందుకున్న నేపథ్యంలో నటరాజ్ సేవలను గుర్తించి జాతీయ కాన్ఫరెన్స్ కు ఆహ్వానించి అవార్డును అందజేశారు. కాగా రక్త దాత గా జాతీయ స్థాయి అవార్డు అందుకున్న లయన్ నటరాజ్ ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

**పట్టు వస్త్రాలను సమర్పించిన పోలీస్ నాగరాజు కుటుంబ సభ్యులు**

**అలంపూర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** మానవపాడు మండల కేంద్రంలోని శ్రీ మాధవ ఆంజనేయ స్వామి దేవాలయం నందు సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవమును తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అశేష భక్తుల మధ్య, మంగళ వాయిద్యాలతో అర్చకుల విశేష పూజలతో స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకుల సమక్షంలో స్వామివారి కళ్యాణము వైభవంగా జరిగింది. కళ్యాణ మహోత్సవంలో స్వామి వారికి పట్టువస్త్రాలను కమిటీ సభ్యులు అందించారు. సీతారాముల వారి కళ్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు తన తండ్రి కీ॥ రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ నాగేంద్రం జ్ఞాపకార్థంగా అన్నదానం కార్యక్రమాన్ని పోలీస్ నాగరాజు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవము ఆహ్వాన పత్రికను గ్రామములోని ఇంటింటికి పంపిణీ చేసి అందరినీ ఆహ్వానించారు. ఈ సందర్భంగా మానవపాడు రైతు సంఘం, గ్రామ ప్రజల సహకారంతో ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జన్మదిన వేడుకలు

**బిజినేపల్లి, ఏప్రిల్ 6 ప్రభతవార్త:** మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రధాన కూడలిలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు పులేందర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి సోదరునిగా ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం తపించిన వ్యక్తి మర్రి జనార్దన్ రెడ్డి అని కొనియాడారు. బిఆర్ఎస్ పాలనలో నియోజకవర్గ అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు అడుగులు వేసిందని అని చెప్పారు. ప్రతి ఒక్క యువ నాయకుడు మర్రి జనార్దన్ రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని నాయకులు కార్యకర్తలు ఆశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, మహేశ్వర్ రెడ్డి, చిన్నారెడ్డి, తిరుపతిరెడ్డి, శేఖర్‌రావు మహేష్ రావు, శ్రీనివాసులు, జగదీష్, శంకర్ గౌడ్, రాజేందర్ గౌడ్, రవీందర్ రెడ్డి, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి

**బిజెపి రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ**

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని బిజెపి రాష్ట్ర నాయకులు నాగు రావు నామాజీ అన్నారు. భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని ప్రతి వార్డుల్లో పార్టీ జెండా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం జిల్లా కేంద్రంలోని నూతన పార్టీ కార్యాలయం ముందు పార్టీ జెండాను ఎగురవేసి పట్టణ పురవీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు నాగు రావు నామాజీ మరియు జిల్లా అధ్యక్షులు కె.సత్య యాదవ్, రఘురామయ్యగౌడ్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. నిరుపేదల సంక్షేమం కోసమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపితం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పోషల్ వినోద్, సీనియర్ నాయకులు ఆశప్ప, గోపాల్ యాదవ్, సత్య రఘుపాల్, విజయకుమార్, పాండు, సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, యువమోర్చా నాయకులు జాజాపూర్ మణిశంకర్, మోహన్, చేతన్‌తో బాటు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** నారాయణపేట ఆర్టీసీ బస్టాండ్‌లో సత్యసాయి భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే చిట్టెంపర్ణిక రెడ్డి, ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు.

**పేట చౌక్ చౌరస్తాలో మరో చలివేంద్రం ప్రారంభం :** పట్టణంలోని చౌక్ చౌరస్తాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల 1981 1983 బ్యాచ్ సభ్యుల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇట్టి చలివేంద్రాన్ని డిఎస్పి నల్లపు లింగయ్య, ఎస్సై వెంకటేశ్వర్లు, భీష్మ ఫౌండేషన్ చైర్మన్ డా. కె.రాజ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ లావణ్య, సత్య సాయి భక్తులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

# అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలు

**- స్వగ్రామాలలో కల్యాణాలు జరిపించిన ఎమ్మెల్యే జీఎంఆర్,మాజీ ఎమ్మెల్యే ఆల**

**భూత్పూర్,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** లోకానికి ఆదర్శప్రాయుడు,జగదానందకారకుడు,జగదభిరాముడు,ఆనందనందనుడైన శ్రీరామ చంద్రుడి జన్మదిన వేడుకలు,కల్యాణ,పట్టాభిషేకాలు ఆదివారం ఊరూరా అంగరంగ వైభవంగా జరిగాయి.ఆయా రామాలయాలు,అంజనేయాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.పచ్చని అరటాకు ముత్యాల పందిళ్లు,మామిడితోరణాలతో ఆలయాలు,ప్రాంగణాలు కళకళలాడాయి.శ్రీసీతారాముల కల్యాణాలు ఊరూరా కన్నుల పండు వగా జరిగాయి.ఆదివారం నాటి శ్రీరామ నవమి వేడుకల్లో దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన రెడ్డి(జీఎం ఆర్),మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి(ఏవీఆర్) పాల్గొని శ్రీసీతా రాముల కల్యాణాలు ఘనంగా జరిపారు.దేవరకద్ర నియోజకవర్గం లోని ప్రస్తుత ఎమ్మెల్యే జీఎంఆర్ తన స్వగ్రామం సీసీకుంట మం దలం దమగ్నాపూర్‌లోని శ్రీఅంజనేయాలయంలో శ్రీసీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు.ఇదే విధంగా మాజీ ఎమ్మెల్యే ఆల తన స్వగ్రామం భూత్పూర్ మండలంలోని అన్నాసాగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,సీతా రామచంద్రస్వామి, సీతమ్మ అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి అంగరంగ వైభవం గా,కన్నుల పండువగా కల్యాణం జరిపించారు.అన్నాసాగర్‌లో నిర్వ హించిన కల్యాణ వేడుకలకు అశేషభక్త జనసందోహం కన్పించింది. ఇక శ్రీరామ నవమి వేడుకలు భూత్పూర్ పట్టణంతో పాటు అమిస్తాపూర్,సిద్దయ్యపల్లి, శేరుపల్లి,గోప్లాపూర్,రాజీవ్ స్వగృహ సారికా టౌన్‌షిప్‌తో పాటు మున్సిపల్ పరిధిలోని పలు తండాలలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి.మండలంలోని తాటి పర్తి, తాటికొండ,కరివెన, మద్దిగట్ల,కప్పెట,పాత,కొత్త మొల్గర, అన్నా సాగర్,పోతులమడుగులలో రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భూత్పూర్ పట్టణంలోని శ్రీఅంజనేయస్వామి ఆలయంలో అంజనేయ భజన కమిటీ ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు అత్యంత వేడుకగా నిర్వహించారు.కల్యాణం అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.పోతులమడుగు గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి అలయంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని ఆలయ కమిటీ చైర్మన్ మనెమోని సత్యనారాయణ ఇతర కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు.భూత్పూర్‌లో నిర్వహించి న కల్యాణ వేడుకల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు నాయకులు టి మురళిధర్‌గౌడ్,సత్తూర్ నారాయణ గౌడ్, సత్తూర్ అశోక్‌గౌడ్,వడ్ల బ్రహ్మయ్య,గొడుగు వెంకటరాజు, గడ్డం రాములు,గడ్డం రాములు,గడ్డం ప్రేమ్,గడ్డం యాదయ్యలతో పాటు కాంగ్రెస్ నాయకులు బోరింగ్ నర్సింహులు,గడ్డం ఎల్లప్ప, మునయ్య,బజార్ పరుశురాం తదితరులు హాజరయ్యారు.గోప్లాపూర్‌లో నిర్వహించిన కల్యాణ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు లాలూ నాయక్,మేకల వేణు,లక్ష్మారెడ్డి,బీఆర్ఎస్ నాయకులు తూము శ్రీనివాస్‌రెడ్డి,మేకల సత్యనారాయణ,బీజేపీ నుంచి పట్నం శ్రీశైలం, ఎంకంపల్లి శ్రీశైలం,గంగాపురం రవీందర్ పాల్గొన్నారు. అమిస్తాపూర్‌లో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో బీఆర్ఎస్ నుంచి మూష సాయిలు,మూష బాలస్వామి,కాంగ్రెస్ నుంచి కోరె పవన్, శివరాములు,మశ్చేందర్,బీజేపీ నుంచి ఎండిఫారూక్,కెంద్యాల శ్రీనివాస్(ఐదిండ్ల శ్రీను)తదితరులు పాల్గొన్నారు.ఇక తాటిపర్తిలో ఆకుల వెంకటయ్య,కరివెనలో బాల్‌రెడ్డి,తిరుపతిరెడ్డి,వెల్కిచర్లలో రాంరెడ్డి,మొల్గరలో వెంకటేష్,శేరుపల్లిలో బోల శేఖర్,చంద్రమౌళి, బాలవర్ధన్‌రెడ్డి,హస్నాపూర్‌లో కొండన్న,సంజీవరెడ్డిలు తదితరులు శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన శ్రీసీతారాముల కల్యాణాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.



విగ్రహాన్ని కల్యాణ వేదికపైకి తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్



కల్యాణం నిర్వహిస్తున్న మండల నాయకులు నర్సింహ్మారెడ్డి



అన్నాసాగర్‌లో శ్రీసీతారామచంద్రస్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల



శ్రీసీతారాముల కల్యాణానికి తరలివచ్చిన భక్తజనం

## పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డులు మంజూరు చేయాలి

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న రేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని పి ఓ డబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు శారద అన్నారు. ఆదివారం నారాయణపేటలో పిఓడబ్ల్యు జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నామని ఊదర పలుకులు పలుకుతున్నారు. కానీ కింది స్థాయి గ్రామాల్లో ఆ రేషన్ బియ్యం తీసుకోవాలన్న రేషన్ కార్డులో పేరు ఉండాలి రేషన్ కార్డు ఉండాలి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంబడే రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి ఇప్పటికి 16 నెలలు గడుస్తున్నా ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయకపోవడం లేదు. అవి మంజూరు చేసిన కూడా గందరగోళంగా ఉండడం ఐదు సంవత్సరాల నుంచి ఏడు సంవత్సరాల పిల్లల పేర్ల మీద రేషన్ కార్డులు రావడం రేషన్ డీలర్లు అయోమయానికి గురి కావడం మొత్తం ఈ రేషన్ కార్డులు ఎవరికి వచ్చాయో తెలవని గందరగోళ పరిస్థితి నెలకొని ఉంది అన్నారు. గత పది సంవత్సరాల నుంచి మీ సేవలో రేషన్ కార్డులో పేరు నమోదు కోసం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు కొన్ని వేలల్లో పెండింగ్లో ఉన్నాయి అవి పరిష్కరించకుండా కొత్తగా సన్నబియ్య మిస్తున్నామని ఊదర పలుకులు పలుకుతున్నారని అన్నారు. అలాగే 500 గ్యాస్ సిలిండర్ విషయంలో కూడా ఇలాంటి పరిస్థితి నెలకొనే ఉంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మాకున్న సమాచారం సర్వే ప్రకారం రూ. 500 ఇస్తున్నామని చెబుతున్న సిలిండర్ సబ్సిడీ రాష్ట్రం మొత్తం 50 కూడా అమలు కావడం లేదు. దీనికి ముఖ్య కారణం లబ్ధిదారులకు రేషన్ కార్డు లేకపోవడం ఒకవేళ ఎవరికైనా రేషన్ కార్డు ఉన్న అది లింకు ఉండాలనే నిబంధన ఉండడం వల్ల చాలామంది సిలిండర్ సబ్సిడీ కోల్పోయే పరిస్థితి ఉంది అన్నారు.రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఒకటే కాదు 12 రకాల నిత్యవసరసరుకులు పప్పు,గోధుమలు,చక్కెర, వంటనూనె, చింతపండు, లాంటి నిత్యవసర సరుకులు రేషన్ డీలర్ షాపుల ద్వారా ప్రజలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని ఏప్రిల్ 7, 8 ,9 తేదీలలో మండల కేంద్రాల్లోని ఎమ్మార్వో లకు వినతి పత్రాలు ఇవ్వాలని 10వ తేదీన జిల్లా కేంద్రంలోని సివిల్ సప్లై ఆఫీసర్‌కు వినతి పత్రాలు ఇవ్వాలని పిఓడబ్ల్యు, పివైఎల్ సంఘాల ఆధ్వర్యంలో ఇవ్వాలని జిల్లా కమిటీలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా పి ఓ డబ్ల్యు ప్రధాన కార్యదర్శి సౌజన్య,ఉపాధ్యక్షురాలు లక్ష్మి, సహాయ కార్యదర్శి భాగ్యలక్ష్మి, కోశాధికారి మహాదేవి, జిల్లా కమిటీ సభ్యులు సరళ, లక్ష్మి, సావిత్రమ్మ, అనిత,రాధిక, అరుణ,సుజాత,మంజుల, చంద్రకళ తదితరులు ఉన్నారు.

## శ్రీశ్రీశ్రీ సద్గురు తిక్క ఈరప్ప స్వామి రథోత్సవం వేడుకలో ఎమ్మెల్యే

**కెటిదొడ్డి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల నియోజకవర్గం కె.టి దొడ్డి మండల పరిధిలోని ఇర్కిచేడు గ్రామంలో శ్రీశ్రీశ్రీ సద్గురు తిక్క ఈరప్ప స్వామి వారి మఠము రథోత్సవం వేడుకలు (జాతర) సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రథోత్సవానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరికాయ కొట్టి స్వామివారి ఆశీస్సులను పొందడం జరిగింది. ఎమ్మెల్యే కి నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. భగవంతు ఇంటిలో తేనేటి విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికీ శ్రీరామనవమి, జాతర శుభాకాంక్షలు తెలంగాణలో సంస్కృతి సాంప్రదాయాలలో గౌరవిస్తూ ప్రతి సంవత్సరం జాతరలు దేవరలు ఆనవాయితీగా గ్రామంలో ప్రతి ఒక్కరు కలిసిమెలిసి జరుపుకునే పండగ ప్రతి ఇంట్లో సంతోష వాతావరణం నెలకొల్పడం అని తెలిపారు. శ్రీ సద్గురు తిక్క ఈరప్ప స్వామి వారి ఆశీస్సులతో ఈ సంవత్సరం రైతులకు, అన్ని ప్రజలకు అన్ని రకాల వ్యాపారాలు దినదిన గద్వాల నియోజకవర్గం అభివృద్ధి చెందాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా స్వామివారిని కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కె.హనుమంతు ,మాజీ జడ్పీ టిసి, మాజీ కౌన్సిలర్, నాయకులు ఆర్.ఉరుకుందు, సత్యా రెడ్డి ,యుగంధర్, చంద్రశేఖర్,ఆంజనేయులు, గోపి, శేఖర్ రెడ్డి, రాజేష్, వివిధ గ్రామాల సీనియర్ నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం

**చిన్నచింతకుంట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో 45వ బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని బీజేపీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు బిజెపి జెండా ఆవిష్కరించారు. నిరుపేదలకు గత ఐదు సంవత్సరాల నుంచి ఉచిత రేషన్ బియ్యం అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మాజీ ప్రధాన కార్యదర్శి నంబిరాజు మాట్లాడుతూ 1985లో ఆవిర్భవించిన బిజెపి పార్టీ రెండు ఎంపీ స్థానాల నుండి 300 స్థానాలకు ఎదిగిందన్నారు. అటల్ బిహారీ వాజ్‌పాయ్, అద్వానీలను అనుసరించుకుంటూ విశ్రాంతి లేకుండా పరిపాలన చేస్తూ దేశాన్ని ప్రపంచ స్థాయిలో గుర్తింపు నరేంద్ర మోడీ తీసుకొచ్చారన్నారు. 130 కోట్ల మందికి ఆహారసరాపర చేస్తున్న ఘనత నరేంద్ర మోడీకి దక్కిందన్నారు. ప్రతి గ్రామంలో మోడీని ప్రజలు మరిచిపోలేరన్నారు. రాష్ట్రంలో బిజెపి ఎదుగుతుంటే కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతుందన్నారు.గతంలో కూడా బిజెపి పార్టీపై బిఆర్ఎస్ ఓర్వలేక ఓడిపోయిందన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు. బిజెపి ఉద్యమాల పార్టీ ఎవరికి భయపడే పార్టీ కాదని ఆయన అన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కుర్వ రమేష్, మండల అధ్యక్షుడు దశరథ్, నాయకులు సుదర్శన్ గౌడ్, వెంకటేశ్వర్ రెడ్డి, ఎర్ర వెంకటన్న, చంద్రుడు, గుబ్బ శ్రీను,జనార్దన్ రెడ్డి వెంకటేష్, బాలచందర్, వికాస్ నరసింహ, మనోహర్, భోగం రాజు శ్రీకాంత్ యాదవ్, టైలర్ వెంకటేష్, దయాసాగర్, శ్రీను, చంద్రి శంకర్,శివ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రములో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు

**కెటిదొడ్డి ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా కెటిదొడ్డి మండల కేంద్రము లో ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు ముందుగా శ్రీ సీతారాముల స్వామి వారి విగ్రహాల కు ఆంధ్రజ్యోతి రిపోర్టర్ కె.రవిప్రకాష్ దంపతుల తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిషేకం చేశారు. కెటిదొడ్డి గ్రామ ప్రజలు, విశ్వహిందూ పరిషత్ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవ కార్యక్రమంలో కె.హరికృష్ణ దంపతులు, కె.గోపాల్ దంపతులు, డి.వీరేష్ దంపతులు ,కమ్మరి రాజు దంపతులు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కెటిదొడ్డి మండల కేంద్రము లో దేవాలయాన్ని అలంకరించి అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కెటిదొడ్డి మండలం అన్ని రంగాల లో రైతులు, పాడి పరిశ్రమ, విద్య, వైద్యా, అన్ని రంగాల వ్యాపార సంస్థలు దినదిన అభివృద్ధి చెందాలని ప్రజలందరూ ఆయురారోగ్యాల తో అష్టైశ్వర్యాల తో నిండు నూరేళ్ళ సుఖ సంతోషాలతో శ్రీ సీతారాముల స్వామి వారి ని భక్తులు కోరుకోవడం జరిగింది. అనంతరం, శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవ వేడుకలకు వచ్చిన భక్తులకు ఆలయ సమీపంలో వెంకట కృష్ణ ట్రేడర్స్ వారు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, విశ్వహిందూ పరిషత్ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా అభ్యాస స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

**మక్తల్ టౌన్, ఏప్రిల్ 6 ప్రభాత వార్త:** మఖ్తల్ పట్టణ కేంద్రంలోని అభ్యాస ది స్కూల్ ప్రైవేట్ పాఠశాలలో 2025 వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వార్షిక వేడుకలను పాఠశాల యాజమాన్యం రాజకీయ ప్రముఖులు సరస్వతి చిత్రపటానికి పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాఠశాలల్లో వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థులలోని ప్రతిభ పాటవాలు వెలికి తీయడానికి దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. విద్యార్థుల చదువు విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి పెట్టి భవిష్యత్తులో ఉన్న శిఖరాలను అధిరోహించాలని, సోషల్ మీడియాలకు బానిసలు కాకుండా తగు జాగ్రత్తతో వ్యవహరించాలని సూచించారు. వార్షికోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు పలు సందేశాత్మకమైన సాంస్కృతి కకార్యక్రమాలు పలువురిని అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కర్నే స్వామి, మాజీ ఎంపిటిసి బలరాం రెడ్డి, దేవరింటి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ కర్నె లక్ష్మి,రమేష్ రావు, ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీనివాస్, విభీషణ్, స్కాలర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అంజిరెడ్డి, డా. శ్రీనివాస్ రెడ్డి, కర్నె క్రిష్ణమూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ శేషగిరి, విజయలక్ష్మి,అంబరీష్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అభ్యాస స్కూల్ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**పశు బల ప్రదర్శన పోటీలను ప్రారంభించిన**

## వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి

**పెబ్బేరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం శాఖాపురం గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా ఏర్పాటు చేసిన పశు బల ప్రదర్శన పోటీలను ఆదివారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ గ్రామాలలో నిర్వహించే ఈ పశు బల ప్రదర్శన పోటీలతో గ్రామాలలో పండగ వాతావరణం నెలకొంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎంతో ప్రేమతో పశువులను పోషించే పశుపోషకులను ఆయన శాలువాలు కప్పి సన్మానించారు. గెలుపు ఓటములు సహజమని ఓడిపోయిన పోటీదారులు బాధపడకుండా లోపాలను సరి చేసుకొని మరో పోటీలో విజయం సాధించేలా కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**ఊట్కూర్,ఏప్రిల్6 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల కేంద్రంలో మండల అధ్యక్షులు జి.రమేష్ అధ్యక్షతన స్థానిక బస్టాండ్ దగ్గర బిజెపి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణలో బిజెపి వస్తుందని ప్రతి ఒక్కరూ బిజెపి పార్టీ సిద్ధాంతం కోసం పనిచేస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు కృష్ణ గౌడ్ ,హనుమంతు, లక్ష్మణ్, గోపాల్, మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ గౌడ్, నారాయణ, తదితరులు పాల్గొనడం జరిగింది.

## వైభవంగా సీతారాముల కళ్యాణోత్సవం

**తెలకపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో పరిసర గ్రామాలలో ఆదివారం శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని అశేష జనవాహిని మధ్య వేద పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఉదయం రాకొండ గ్రామంలోని రామకొండ గుట్టపైన, మండలంలోని వివిధ గ్రామాలలో మాజీ ప్రజా ప్రతినిధులు ఎంపీటీసీలు, మాజీసర్పంచులు,భక్తులు,వివిధపార్టీల నాయకులు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నాయకులు భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉత్సాహంగా కోలాటాల పోటీలు

**ఉప్పునుంతల, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** శ్రీ రామనవమి ఉత్సవా ల్లో భాగంగా మండల కేంద్రంలో కోలాటాల పోటీలు ఉత్సాహం గా జరిగాయి. ఈనెల 5నుంచి 8 వరకు కేదారేశ్వర, చెన్నకేశవ ఆలయంలో శ్రీరామనవమి మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణోత్సవ అనంత రం సాయంత్రంకోలాటాల పోటీలను నిర్వహించారు.ఇందులో 5జట్లు పాల్గొన్నాయి.చిన్నారులు వేసిన కోలాటాలను మండల ప్రజలు ఆసక్తితో తిలకించారు. ఈ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు అబ్బురపరిచే వస్త్రాధారణ, ఘల్లుమనే గజ్జలు, ఆకట్టుకునే కోలాటాలు వేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

## ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిన బిజెపి పార్టీ

**మద్దూర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూరు పట్టణలో కేంద్రంలో ఆదివారం రోజు బిజెపి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. మద్దూరు మండల అధ్యక్షులు మండలం నాయకులు గ్రామస్థాయి బూత్ అధ్యక్షులు కార్యకర్తలు అందరూ కష్టపడి మన పార్టీని పటిష్టం చేయాలని ప్రతి ఒక్కరు తమ తమ ఇంటిపై బిజెపి జెండా ఎగురవేసి గావ్ చలో, బస్తీ చలో కార్యక్రమంలో పాల్గొని ప్రతి గ్రామంలోనూ, వాడలలోను రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి బీజేపీ సిద్ధాంతాలు తెలియజేసి పార్టీలోకి చేరే విధంగా ప్రోత్సహిస్తూ, అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి గ్రామంలో అట్టడుగు స్థాయి వరకు తీసుకెళ్లి నిరుపేదలు అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలని కార్యకర్తలను ఉద్దేశించి మద్దూరు మండలం బిజెపి పార్టీ అధ్యక్షుడు భవాని శంకర్ అన్నారు.

## భూత్పూర్‌లో ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**భూత్పూర్,ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ(బీజేపీ) 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం భూత్పూర్ పట్టణ కేంద్రంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ జెండాను పార్టీ పట్టణ అధ్యక్షుడు ముత్యాల నర్సింహులు,రూరల్ అధ్యక్షుడు ఉంద్యాల రాంరెడ్డిలు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి ఫారూక్‌తో పాటు నాయకులు కెంద్యాల శ్రీనివాస్(ఐదిండ్ల శ్రీను),సత్తూర్ సత్తయ్యగౌడ్,లిక్కి హరినాథ్‌గౌడ్,ఎంకంపల్లి మల్లేష్,పట్నం శ్రీశైలం,రాము తదితరులు పాల్గొన్నారు.